
పెంట కాలువలు

- కాల్వల్లోకి అమర్చిన మరుగుదొడ్ల గొట్టాలు
- అడ్డుకట్ట వేసేవారే కరవు
- చెంతనే జలవనరుల శాఖ కార్యాలయం
- పట్టించుకోని మున్సిపాలిటీ

అమలాపురం టౌన్: పవిత్ర గోదావరి జలాలతో గల గల పారే పంట కాల్వలు కలుషిత కాసారాలై ప్రవహిస్తున్నాయి. అమలాపురం ప్రధాన పంట కాల్వ పట్టణం మీదుగా రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాలకు సాగునీరు అందిస్తోంది. పట్టణంతో పాటు మూడు మండలాల ప్రజలకు తాగునీరు అందించే ప్రాజెక్టులకు ఈ కాల్వ నీరే ఆధారం. ఈ కాల్వ ద్వారానే సుమారు 18 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతోంది. ఇదే కాల్వ నీటి ద్వారా దాదాపు 2.30 లక్షల మంది జనాభాకు తాగునీరు అందించే ప్రాజెక్టులకు ప్రధాన జల వనరులుగా నిలుస్తున్నాయి. అలాంటి పంట కాల్వ నీరు ఇప్పుడు మానవ స్వార్థం, తప్పిదాలతో కలుషిత కాసారంగా మారుతోంది.

అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాల్వ వెంబడి రోడ్డు చెంత, కాల్వ గట్ల చెంత ఇళ్లు ఉన్న కొంత మంది నివాసితుల స్వార్థం తోడై ఈ కాల్వలో ప్రవహించే నీరు మల మూత్రాలతో ప్రవహిస్తోంది. ముఖ్యంగా అమలాపురం పట్టణం మీదుగా ప్రవహించే నల్లవంతెన- ఎర్ర వంతెన మధ్య దాదాపు కిలో మీటరు ప్రవహించే కాల్వ గట్టు (హౌసింగ్ బోర్డు కాలనీ వైపు) పైకి అందంగా ఆధునీకరించిందే తప్పా కాల్వ నీరు ఎంత కలుషితమవుతున్నా మున్సిపాలిటీ పట్టించుకోవడం లేదు. అదే రోడ్డుకు, కాల్వ గట్టుకు స్వార్ధ పరులు తూట్లు పొడిచి తమ ఇళ్ల మరుగదొడ్ల గొట్టాలు నేరుగా పంట కాల్వలోని పెట్టి నిత్యం వదులుతున్న మల, మూత్రాలు నీటిలో కలసి ప్రవహిస్తున్నాయి. ఈ రెండు వంతెన మధ్య ఇదే రోడ్డులో జలవనరుల శాఖ కార్యాలయం ఉన్నా ఈ తప్పిదం గురించి అంతా తెలిసి కూడా ఏ ఒక్క అధికారి స్పందించి చర్యలు చేపట్టరు. అలాగే ఆ రెండు వంతెనల మధ్య (ఎన్టీఆర్ మార్గ్) ఇదే పంట కాల్వ చెంత దాదాపు 10 డివిజన్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా ఆ అధికారులూ నోరు మెదపరు. రెండు వంతెన మధ్య దాదాపు 25 ఇళ్లకు సంబంధించిన మరుగుదొడ్ల గొట్టాలు కాల్వలోకి గతంలోనే గుట్టు చప్పుడు కాకాకుండా అమర్చేశారు. కాల్వ గట్లను ఆధునీకరిస్తున్నప్పుడు ఈ అక్రమ గొట్టాలను తీసివేసి ప్రక్షాళన చేయాల్సిన అధికారులు చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



నల్ల వంతెన- ఎర్ర వంతెన మధ్య ప్రధాన పంట కాల్వలోకి అమర్చిన ఓ ఇంటి మరుగుదొడ్డి గొట్టం



పంట కాల్వలోకి ఏర్పాటు చేసిన ఇళ్ల మరుగుదొడ్ల గొట్టాలు

గ్రామీణ ప్రాంతాల్లోనూ అంతే

అమలాపురం ప్రధాన పంట కాల్వ పట్టణం మీదుగానే కాకుండా ఎర్ర వంతెన నుంచి గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రవహిస్తుంది. కామనగరువు, సమనస, సావరప్పాలెం, గోకవరం, సరిపల్లి, చల్లపల్లి, ఎస్ యానాం వరకూ దాదాపు 12 కిలోమీటర్ల మేర పారుతుంది. అమలాపురం ఎర్ర వంతెన నుంచి కాల్వ చెంత ఉన్న కొన్ని ఇళ్ల తాలూకు మరుగు దొడ్ల గొట్టాలు కాల్వ నీటిలోకి ఏర్పాటు చేశారు. ఇదే ప్రాంతంలో కొన్ని దుకాణాలకు చెందిన మరుగు దొడ్ల గొట్టాలు సైతం కాల్వలోనే ఉంటాయి. దీనికి తోడు ఎర్ర వంతెన ప్రాంతంలో ఉన్న కొన్ని రొయ్యల కొనుగోలు కేంద్రాల వారు సైతం రొయ్యల వ్యర్థాలను ఇదే కాల్వలో పోసి మరింత కలుషితానికి కారకులవుతున్నారు.

సమన్వయ లోపమే శాపం

సాగు, తాగునీటితో పారే అమలాపురం ప్రధాన పంట కాల్వ కలుషిత కాసారం కాకుండా కాపాడేందుకు అమలాపురం జల వనరుల శాఖ, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయం లేకే ఈ తప్పిదం యథేచ్ఛగా సాగిపోతోంది. ఆ రెండు శాఖల అధికారులు సమన్వయంతో ఉమ్మడి చర్యలు చేపడితే ఈ సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేది. ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది. అలాగే ఎర్ర వంతెన నుంచి కాల్వ నీరు కలుషితం అయ్యే సమస్యపై అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందిస్తేనే పరిష్కార మార్గం దొరుకుతుంది.

హెల్మెట్ ధారణపై పోలీసుల వినూత్న ప్రచారం



ఆకట్టుకున్న చిత్రగుప్తుడు, యమధర్మరాజు ఫ్లెక్సీ

అమలాపురం టౌన్: కొత్తగా వచ్చిన ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధారణపై అమలాపురం పోలీసులు వినూత్న ప్రచారం చేస్తున్నారు. వాహన చోదకులకు అవగతమయ్యేలా మరికొన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. 'ప్రభూ..హెల్మెట్ లేదు...వేసేయ్ మంటావా' అంటూ చిత్రగుప్తుడు యమ ధర్మరాజుకు చెబుతున్నట్లు, ఆ పక్కనే హెల్మెట్లు లేకుండా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెళుతున్న దృశ్యాలు ఫ్లెక్సీల్లో ముద్రించి ప్రచారం చేస్తున్నారు. అలాగే లలిత జ్యూయలర్స్ ప్రకటన కోసం ఆ సంస్థ యాజమాని మాట్లాడుతున్నట్లుగా 'డబ్బులు ఊరికే రావు' అంటూ హెల్మెట్ లేకపోతే జరిగే ప్రమాదంతో ఆస్పత్రి పాలైతే డబ్బులు చెల్లించే అంశంపై హెచ్చరిస్తున్న వైనాన్ని ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయడంతో ప్రజలు వాటిని ఆసక్తిగా తిలకించి చదువుతున్నారు. పట్టణ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు ఈ ఫ్లెక్సీలను పట్టణంలోని పలు రోడ్ల చెంత ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి విశ్వరూప్‌ను కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు



విశ్వరూప్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉప్పలగుప్తం: ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షునిగా నియమితులైన నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన సన్నవిల్లి ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారిలు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్‌ను అమలాపురం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వరూప్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి నూతన కార్యవర్గాలను నియమించారని, కూటమి ప్రభుత్వ దౌర్జన్య పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని విశ్వరూప్ సూచించారు.

పేదలకు కళ్లజోళ్ల పంపిణీ

అమలాపురం రూరల్: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల కోనసీమలో గంగలకుర్రు, సిరిపల్లి, చిందాడగరువు గ్రామాల్లో మెడ్ యునైటెడ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో అవసరమైన వారికి ఆదివారం కళ్లజోళ్ల పంపిణీ చేశారు. అమలాపురం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాల్‌రావు, జాకర్ రాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లయన్స్ క్లబ్ ఐ విజన్ ట్రెజరర్ జంపన సుమన్ వర్మ ఆర్థిక సహాయంతో 35 మందికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీజీపీ సునీల్‌కుమార్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

అల్లవరం: ప్రస్తుత డీజీపీ సునీల్‌కుమార్‌ను కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేయడం దారుణమని బీఎస్పీ సీనియర్ నాయకులు జిత్తుక సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, అధికారులను విధులు చేపట్టకుండా అడ్డుపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మానుకోవాలని సత్యనారాయణ హితవు పలికారు.

స్థల కేటాయింపుపై అధికారులు స్పందించాలి

యానాం: యానాం పట్టణం, తీర గ్రామాల్లో సేకరిస్తున్న పారిశుధ్య వ్యర్థాలను ఆయా ప్రాంతాల్లో కుప్పలుగా వేస్తున్నారే తప్ప సేకరించిన చెత్తను లిఫ్ట్ చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణం డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని కేటాయించడంతో పాటు చెత్తను తొలగించాలని ఆదివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బంది లేని ప్రదేశంలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయింపునకు ఆర్ఏఓ మునిస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తదితరులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో అసోసియేషన్ జిల్లా, రాష్ట్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం డివిజన్ పరిధిలోని ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక వాగ్దేవి స్కూలులో ఆదివారం జరిగిన డివిజన్ స్థాయి అసోసియేషన్ సమావేశంలో ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా, రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు ఆకుల బాపన్ననాయుడు, మట్టపర్తి సత్యనారాయణల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గాన్ని వారు అభినందించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా నెల్లి రమేష్, మంగళంపల్లి అంజిబాబు, తోట నరసింహం, కంకిపాటి గణపతి, అధ్యక్షునిగా పోతూరి లక్ష్మీ శ్రీనివాసన్, కార్యదర్శిగా గిడ్ల రమేష్, కోశాధికారిగా శ్రీరామ సతీష్‌లు ఎన్నికయ్యారు.

లక్ష్మీరాధ సేవలు అభినందనీయం

తాళ్లరేవు: పి.మల్లవరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పెద్దిరెడ్డి లక్ష్మీరాధ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఇటీవల ఆమె పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం సత్కార సభను నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, నాయకులు ధూళిపూడి వెంకటరమణ, సుబ్బారావు, శుభ తదితరులు లక్ష్మీరాధ దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు.

సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ సస్పెన్షన్‌పై నిరసన



సునీల్ కుమార్ సస్పెన్షన్‌పై నిరసన తెలుపుతున్న దళిత ఐక్యవేదిక నాయకులు

అమలాపురం రూరల్: సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్‌ను కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేయడంపై మండలంలోని ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు నిరసన తెలిపారు. దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన ఉన్నతాధికారులపై వివక్ష ఆపాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళిత సామాజిక వర్గానికి చెందిన అధికారులను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, కేవీపీఎస్ ప్రతినిధి శెట్టిబత్తుల తులసీరావు, బీఎస్పీ జిల్లా నాయకులు వాకపల్లి హరీష్, మాజీ సర్పంచ్ నక్కా సంపత్, దళిత నాయకులు పాల్గొన్నారు.

చిట్టి చేతులు.. గట్టి చేతలు!

- అలరించిన విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన
- హాజరైన పలువురు ప్రముఖులు



విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక నమూనాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

అమలాపురం టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక వాగ్దేవీ స్కూలులో 'క్రియేటివ్ కార్నివాల్' పేరుతో ఆదివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ విజ్ఞాన దాయకంగా జరిగింది. విద్యార్థులు దాదాపు 300 నమూనా ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థుల సైన్స్ ప్రయోగాల ప్రదర్శనలను పరిశీలించారు. విశ్రాంత శాస్త్రవేత్త, విజిటింగ్ ప్రొఫెసర్ బిట్స్ పిలాని కేఎస్ఎస్‌రావు, విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త సూర్యనారాయణ ఈ ప్రదర్శనలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విశ్రాంత శాస్త్రవేత్తలు వేసిన ప్రశ్నలకు విద్యార్థులు తగిన సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు. ఉత్తమ ప్రదర్శనలకు విశ్రాంత శాస్త్రవేత్త కేఎస్ఎస్ రావు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా అమలాపురం మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. స్కూలు డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి, హెచ్ఎం పిచ్చిక సుబ్రహ్మణ్యం తదితరులు సైన్స్ ప్రదర్శనలు, ఉచిత వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలి

జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో పాటు సామాజిక బాధ్యతలను అవగతం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి అన్నారు. మండలంలోని కామనగరువు ఆదిత్య స్కూల్ వార్షికోత్సవం స్కూల్ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జేసీ నిషాంతి మాట్లాడుతూ బాల్య జ్ఞాపకాలు జీవితంలో మరపురానివని అన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులే మొదటి గురువులని వారు తమ పిల్లల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న జేసీ నిషాంతి

సుంకరపాలెం సర్పంచ్ టిళ్లపూడి ఔదార్యం

మార్కెట్‌కు 500 గజాల స్థలం దానం

తాళ్లరేవు: మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం గ్రామ సర్పంచ్ ఔదార్యం చాటారు. సుమారు రూ.50 లక్షలకు పైగా విలువైన 500 గజాల స్థలాన్ని మార్కెట్‌కు దానం చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని సుంకరపాలెం, కేంద్రపాలిత ప్రాంతమైన యానాం కనకాలపేట సెంటర్‌లో మార్కెట్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ మార్కెట్ కారణంగా రద్దీ పెరిగిపోవడం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో మార్కెట్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని స్థానిక వ్యాపారులు ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావును సంప్రదించగా యానాం-ద్రాక్షారామ సరిహద్దులో ఉన్న సుమారు 10 సెంట్లభూమి(500 గజాలు)ని మార్కెట్ ఏర్పాటుకు ఇచ్చేందుకు అంగీరించారు. మార్కెట్ నిర్వహణకు సంబంధించి ఆదివారం యానాం మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కోన కొండబాబు శంకుస్థాపన చేసి కార్యకలాపాలను ప్రారంభించారు. విలువైన భూమిని మార్కెట్‌కు కేటాయించిన సర్పంచ్ నాగేశ్వరరావును వ్యాపారులు, గ్రామస్తులు అభినందించారు.



దాత ఇచ్చిన స్థలంలో మార్కెట్‌కు శంకుస్థాపన చేస్తున్న కొండబాబు

నిరామయ పథకంపై అవగాహన

అమలాపురం రూరల్: వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈదరపల్లి హరిమనో వికాస కేంద్రం దివ్యాంగుల పాఠశాలలో ఆదివారం నిరామయ పథకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాల నిర్వాహకుడు సల్లాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రూ. లక్ష ఆరోగ్య బీమా వస్తుందని చెప్పారు. దివ్యాంగుల ధ్రువ పత్రాలు కలిగిన వారికి పథకం వర్తిస్తుందన్నారు హరిమనో వికాస కేంద్రం మేనేజింగ్ డైరెక్టర్ రాజ్ కుమార్ దరఖాస్తులు చేసుకునే విధానాన్ని వివరించారు.

దివ్యాంగుల సర్టిఫికెట్ల జారీకి నేటి నుంచి నమోదు

యానాం: నియోజకవర్గ పరిధిలో దివ్యాంగుల సర్టిఫికెట్ల జారీకి గానూ ఈ నెల 3 నుంచి 5 వరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, వివిధ ఆరోగ్య ఉపకేంద్రాల్లో దివ్యాంగులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జీజీహెచ్ డీడీ రవిశంకర్ కోరారు.

రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి

జన జాగృతి సభలో వక్తలు

యానాం: భావ వ్యక్తీకరణ ద్వారా సామాజిక స్ఫూర్తిని అలవర్చుకుంటూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రముఖ న్యాయవాది, ఏపీ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సర్వశిక్షా అభియాన్ సమావేశ హాలులో 75వ రాజ్యాంగ అవగాహన దినం సందర్భంగా ఏపీ హేతువాద సంఘం, యానాం సివిల్‌రైట్స్ సొసైటీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన జన జాగృతి సభలో ఆయన మాట్లాడారు. సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పానుగుమట్ల విష్ణుమూర్తి అధ్యక్షత వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో హక్కుల ఉల్లంఘన జరుగుతుందని దళితులు, ఆదివాసీలు, మహిళలు మత స్వేచ్ఛపై జరుగుతున్న హింసాత్మక ధోరణిని ప్రశ్నిస్తే దేశ ద్రోహం కేసులు నమోదు చేస్తున్నారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అఖిల భారత హేతువాద సంఘం, ఒంగోలు అధ్యక్షుడు నార్నే వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ మూఢ నమ్మకాలు దేశాన్ని వెనక్కి తీసుకు వెళుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి కలైమామణి దాట్ల దేవదానంరాజు, రిటైర్డ్ ఆర్ఏఓలు నామాడి అప్పారావు, గిడ్డి బలరామ్, నాయకులు పాల్గొన్నారు.



రాజ్యాంగ అవగాహన జన జాగృతి సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల

చెత్త నిర్వహణతో అవస్థలు

- కనకాలపేట డంపింగ్ యార్డు నిలిపివేతతో స్థానికుల ఇక్కట్లు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు
- బహిరంగ ప్రదేశాలు, ఇళ్లల్లో పేరుకుపోతున్న చెత్త
- అధికారుల తీరుపై ప్రజాగ్రహం

యానాం: నియోజకవర్గ పరిధిలో చెత్తను డంప్ చేసే కనకాలపేట డంపింగ్ యార్డును అధికారులు నిలిపివేసిన నేపథ్యంలో దాని స్థానంలో వేరొక చోట స్థలం చూపించాల్సి ఉన్నా సంబంధిత అధికారులు స్థలాన్ని చూపించక పోవడంతో ఇళ్లల్లో ఉండే చెత్తతో పాటు బహిరంగ ప్రదేశాల్లోని చెత్త పేరుకుపోతోందని ఆదివారం పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో చెత్తను ఎత్తడానికి హెచ్ఆర్ స్క్వేర్ అనే సంస్థ కాంట్రాక్టు కుదుర్చుకుంది. గత మూడేళ్లుగా వారు పారిశుధ్య నిర్వహణను చేస్తున్నారు. అయితే కనకాలపేట డంపింగ్ యార్డును తొలగించాలంటూ పరిసర ప్రాంతాల గ్రామస్తులు ఆందోళన నిర్వహించడం అనంతరం ఎల్జీ సైతం దానిని నిలుపుదల చేయాలని ఆదేశించడంతో గత కొన్ని రోజులుగా అక్కడికి చెత్త తరలింపు నిలుపు చేశారు. అయితే చెత్తను వేయడానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించకపోవడంతో చెత్త ఎక్కడ వేయాలో తెలియడం లేదని హెచ్ఆర్ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కురసాంపేట-మెట్టకూరు బైపాస్ వద్ద చెత్తను వేస్తుంటే స్థానికులు అడ్డుకున్నారు. దీంతో పారిశుధ్య సిబ్బందికి, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు వచ్చి సర్ది చెప్పారు.



బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోతున్న చెత్త

సెలవు పెట్టి వెళ్లిన మున్సిపల్ కమిషనర్

గతంలో డంపింగ్ యార్డు కోసం కొత్తగా స్థానిక గోపాల్‌నగర్ విద్యుత్ స్టేషన్, సావిత్రినగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం స్థలం చూపించినప్పటికీ అక్కడి గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో స్థలాన్ని కేటాయించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క సమస్యను చక్కదిద్దాల్సిన ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ సెలవుపై వెళ్లడంతో స్థానికులు మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా విజయ కనకదుర్గ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



అమ్మవారి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం, చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామాల మధ్య నదీ తీరాన నిర్మించిన విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా తొలిరోజున వేద పండితులు కొండవీటి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పలు హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు తదితరులు హాజరై పూజలు చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా మూడవ రోజైన సోమవారం ఉదయం విజయ కనకదుర్గ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి రథోత్సవం

ఐ.పోలవరం : నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలను ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఐదో రోజు కార్యక్రమాలలో భాగంగా ఉదయం స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులతో సంగీత విభావరి నిర్వహించారు. కోలాటాలు, గరగ నృత్యాల నడుమ భద్రకాళీ సమేత వీరేశ్వరుడ్ని ప్రత్యేక రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. వృద్ధ గౌతమీ గోదావరి వద్ద గోదావరి మాతకు ఆలయ పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి, వేదపండితుడు సుబ్రహమణ్య శాస్త్రి, ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బరావు, పేటేటి శ్యామలకుమార్ తదితరుల ఆధ్వర్యంలో పంచ హారతులు నిర్వహించారు. పుష్కర ఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్వామివారు నదీ విహారం చేసే సమయంలో గోదావరి ఒడ్డున చిన్నారుల నాట్య విన్యాసాలు భక్తులను మంత్ర ముగ్ధులను చేశాయి. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రథంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

వీరేశ్వరుని సన్నిధిలో యూపీ డీజీపీ

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని ఉత్తరప్రదేశ్ డీజీపీ పీపీవీ రామశాస్త్రి దంపతులు ఆదివారం దర్శించుకొన్నారు. వీరికి ఆలయ పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాశీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: క్రీడాభివృద్ధికి పరితపించిన జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ రిఫరీ దివంగత రంకిరెడ్డి కాశీ విశ్వనాథం కాంస్య విగ్రహాన్ని ఆఫీసర్స్ క్లబ్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని క్రీడా సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు సూచించారు. స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ (ఇన్‌డోర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు)లో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కాశీ సంతాప సభలో క్రీడా సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు కాంస్య విగ్రహం ఏర్పాటుపై చర్చించారు. సంతాప సభకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు మాట్లాడుతూ కాశీ కాంస్య విగ్రహం ఏర్పాటు ఆవశ్యతకను వివరించారు. సభకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షత వహించారు. కాశీ మరణం జిల్లా క్రీడా రంగానికి తీరని లోటని వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర అన్నారు. క్లబ్ ప్రతినిధులు డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ రాఘవేంద్రరావు, పుత్సా కృష్ణ కామేశ్వర్, నూకల సత్యనారాయణ, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి తదితరులు హాజరయ్యారు.



కాశీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు